# పులివేట

మాటువేసి, మేకను ఎరజూపి దొంగచాటుగా పులిని కొట్టడం ఒక గొప్పకాదు. ధైర్యంగా పులికి ఎదురు వెళ్ళి తుపాకిని పేల్చడం వేటగాని శక్తి సామర్థ్యాలను తెలియజేస్తుంది. ఆవిధంగా చేయడంవల్ల ఒక్కొక్కసారి అనుకోకుండా వేటగాడు ఆపదలో చిక్కుకునే ప్రమాదం ఉంది. దాన్ని తట్టుకోలేకపోతే ప్రాణాపాయం జరగడానికి కూడా ఆస్కారం ఉంది.

నేను ఐదోఫారం చదివే రోజుల్లో మా బాబాయి ఒక చిరుతపులిని వేటాడారు. ఆనాటి సంఘటనను తలచుకుంటే ఇప్పటికీ నాకు

పి.వి. నరసింహారావు



ఒళ్ళు జలదరిస్తూంటుంది.

అప్పుడు మా నాన్నగారు ఒక పల్లెటూళ్ళో డాక్టర్‌గా పనిచేస్తూండేవారు. అక్కడ విద్యా సౌకర్యాలు లేవందువల్ల నేను చదువుకోవడానికి బుచ్చిరెడ్డిపాలెం మా బాబాయి దగ్గరకు వెళ్లాను.

బాబాయికి వేటంటే తగని పిచ్చి. జంతువులవేటే కాదు, పేవల వేటన్నా సరదాయే! పిల్లలం మేము గేలాపువేటకు సరదాగా వెళ్ళుతూంటే మాకన్నా సరదాగా మావెంట వచ్చేవారు. బాబాయికి పులివేటఅంటే అన్నిటికన్నా మక్కువ ఎక్కువ. ఎన్నాళ్ళనుంచో పులిని వేటాడాలని కోరిక. ఎక్కడైనా చుట్టుప్రక్కల గ్రామాల్లో పులి కనపడిందని వింటే చాలు; తుపాకి భుజానికి వేలాడేసుకుని మోటార్‌సైకిల్ మీద అప్పటికప్పుడు బయలుదేరుతూండేవారు. అదేమి దురదృష్టమో కాని, ఆయన వెళ్లే సమయానికి ఆ పులి అక్కడినుండి వెళ్ళిపోయేది.

బుచ్చికి (బుచ్చిరెడ్డిపాలెంకు బుచ్చి అంటారు లెండి) పదిమైళ్ల దూరంలో ఉంది 'సంగం' అనే గ్రామం. ఒకవిధంగా అది చిన్నగ్రామమనే చెప్పవచ్చు. చుట్టూ కొండలు, ఒకప్రక్క పెన్నా నది—ఆ గ్రామానికి ప్రకృతి సిద్ధమైన సౌందర్యాన్ని చేకూర్చాయి.

ఒకనాడు బాబాయికి కబురందింది: సంగంలో ఒక చిరుతపులి చొరబడి ఒక ఆవును చంపి ఈడ్చుకుపోయిందని. బాబాయి వెంటనే వెళ్ళారు సంగతి, సమాచారం తెలుసుకుందామని.

పులి రెండు రోజులకు, మూడు రోజులకు ఊళ్ళో పడి ఏదో ఒక జంతువును చంపి తీసుకుపోతూందని సమాచారం సేకరించారు. కాని పులి ఊళ్ళో ప్రవేశించటానికి ఒక నిర్ణీత సమయం ఉన్నట్టు లేదు. సామాన్యంగా రాత్రి వేళల్లో ఊరిమీద పడుతున్నట్లు ఆ గ్రామ ప్రజలు చెప్పారు. ఐతే దాన్ని వేటాడ్డానికి ఏ సమయంలో వెళ్ళాలి అన్నదే ప్రశ్న. అక్కడ రెండు మూడు రోజులు మకాం వెయ్యాలంటే ఇక్కడ పని లెవరు చూస్తారు? ఏం పని అంటారేమో? అన్నట్టు చెప్పడం మరిచాను. మా బాబాయికూడా నాన్నగారిలా డాక్టరే! బుచ్చిలో ప్రాక్టీసు చేస్తున్నారు. కనుక రోగుల్ని వదిలి రోజుల తరబడి పైగ్రామం వెళ్ళి ఉండిపోవడం కుదురదు. ఏం జేస్తారు మరి? పులి ఊళ్ళో పడిందని కబు రందగానే తుపాకిని వేలాడేసుకుని వెళ్ళి, పులి తిరిగి వెళ్ళిపోయిందంటూ వట్టి చేతులతో తిరిగి వచ్చేవారు.

పదిహేను, ఇరవైరోజులు ఇట్లానే గడిచాయి. పులి రావడం, ఏదో ఒక జంతువును చంపి కొండలమీదకు ఈడ్చుకొని పోవడం జరుగుతుండేది. పాపం, ఆ ఊరివాళ్ళు గోలపెడుతూండేవారు. వాళ్లెవ్వరికీ ఆ పులి జోలికి వెళ్లటానికి ధైర్యం ఉండేది కాదు.

ఒకనాడు ప్రొద్దుటే బాబాయి ముఖం కడుగుతున్న సమయంలో ఆ ఊరినుండి వచ్చే

# పులివేట

బస్సు కండక్టర్ గాభరాగా వచ్చి చెప్పిన వివరాలు: ఆ ఊరికి అంతకు ముందురోజే ఒక వేటగాడు వచ్చాడు. సాయంకాలం చీకటి పడుతున్న సమయంలో పులి ఊరిలో ప్రవేశించింది. వేటగాడు రైఫిల్ పట్టుకుని దారిలో ఒక చెట్టు వెనుక దాగి పులికోసం కాశాడు. పులి దగ్గరకు రావడం, వేటగాణ్ణి చూడటం, అతడు రైఫిల్ పేల్చడం జరిగాయి. గుండు పులి శరీరంలోకి చొచ్చుకొనిపోయింది. ఒక్క ఊపున పులి వేటగాడి జెబ్బమీద పంజాతోకొట్టి పారిపోయింది. వేటగాడి భుజంనుండి రక్తం కారుతూంటే అక్కడివాండ్లు కట్టుకట్టడానికి వానిని తీసుకుపోయారు. పులి ఇంకా కొండమీద పొదల్లో ఉందట. తాను ప్రొద్దుట వచ్చేటప్పుడు కూడా చూశాడట.

బాబాయి వెంటనే తయారయి 'డబుల్‌బార్ గన్' వీపుమీద వేలాడేసుకుని మోటార్‌సైకిల్ ఎక్కారు. తను ఇరవైరోజులుగా ఆ చిరుతపులిని వేటాడ్డానికి ప్రయత్నిస్తూంటే ఎవడో దాన్ని చంపడానికి వచ్చాడంటే ఒకవిధమైన బాధ, కోపం కలిగాయి.

అప్పుడు ఆయన్ను మోటారు సైకిల్ మీద చూచినవారి మాట లివి—

"గంటకు డెబ్బైమైళ్ల స్పీడుకు తక్కువుండదు."

"అబ్బా! భూమికి జానెడెత్తునుండి మోటార్ సైకిల్ వెళ్తూందే!"

"ఈరోజు ఎక్కడో రోడ్డు ప్రమాదం జరిగేట్టుంది!"

"మోటార్ సైకిల్ నడపడంలో ఈయనకు ఈయనే సాటి!"

మోటార్ సైకిల్ సంగం చేరగానే అందరూ ఆయన్ను చుట్టేశారు, "మీకోసమే ఎదురు చూస్తున్నాం! పులి ఇంకా పొదల్లోనే ఉంది" అంటూ.

సైకిల్ దిగి, గన్ లోడ్‌చేసి బయలుదేరారు. కొండ దిగువ భాగమంతా జనం నిలబడి చూస్తున్నారు. చిరుతపులి కొండమీద ఏభై అడుగుల ఎత్తున పొదల్లో ఉంది. కొంతమంది పెద్దవాళ్లను తీసుకొని బాబాయి కొండమీదకు వెళ్ళారు—"పులి ఏ పొదల్లో ఉన్నదో చూపించ" మంటూ.

"ఇదిగో ఇక్కడ ఆగి ఆ పొదల్లో చూడండి"

> *ఎరజూపి, దొంగచాటుగా పులిని చంపడం గొప్పకాదు. బాహాటంగా ఎదిరించి నిలిచి హతమార్చడం గొప్ప. నిజమే. కాని, అంతటి సాహసానికి పూనుకొనేవారు ఎవరు?*

అంటూ ఒక దగ్గర ఆగి పులి ఉన్న పొదను చూపించారు. బాబాయి జాగ్రత్తగా పొదను పరిశీలించారు. కాని పులి కనుపించలేదు. ఆవలముందొక పెద్ద రాయి ఉంది. తుపాకిని ప్రక్కనున్న ఒకనికి ఇచ్చి రాయిపై ఎక్కి తిరిగి పొదలోకి చూచారు. ఓ! పులి చాలా చక్కగా కనిపిస్తున్నది. తనను నిశితంగా పరిశీలించడం గమనించింది కాబోలు ఒక్క క్షణంలో పొదనుండి బయటి కురికింది. బాబాయి వెంటనే రాయిదిగి తుపాకికోసం వెనక్కు చేతిని చాపుతూ కొద్దిగా వెనక్కు తిరిగారు. అంతే! తుపాకిని పట్టుకున్న యువకుడు, అక్కడకు వచ్చిన 'పెద్దవాళ్ళు' వెనక్కు చూడకుండా పరుగెత్తడం కనుపించింది.

భీకరంగా చూస్తూ ఆరడుగుల దూరంలో దెబ్బతిన్నపులి ఇక క్షణం ఆరక్షణంలో మీద పడుతుంది. చుట్టూ ఉన్న ప్రజలు భయంగా స్తబ్ధులై చూస్తున్నారు. అందరూ డాక్టరుగారిమీద ఆశ వదులుకున్నారు. బాబాయి అదే భీకరత్వంతో గంభీరంగా పులి కళ్లలోకి చూస్తూ ధైర్యంగా నిలబడ్డారు. వీళ్లను చూస్తూ ఆశ్చర్యంగా ఏమవుతుందోననే ఆత్రుతతో అందరూ వీళ్లలాగే రెప్పవేయకుండా చూస్తున్నారు.

నిమిషం.... రెండు....మూడు...పులి మెల్లగా రెండడుగులు వెనక్కు వేసింది. బాబాయి అదే విధంగా రెండడుగులు వెనక్కు వేశారు. పులి వెనక్కుతిరిగి కొండ ఎక్కింది. అందరి ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. బాబాయి వెనక్కు వచ్చి తుపాకిని ఆ యువకుని వద్దనుండి తీసుకొన్నారు. అతడు పాపం, తలవంచుకొన్నాడు. ఎవరికి మాత్రం ప్రాణం అంటే తీపి ఉండదు?

"డాక్టరుగారి ఆయుస్సు గట్టి" దన్నారు.

"డాక్టరుగారికి గొప్ప ధైర్య" మన్నారు.

"ఇంకొకరైతే ఈ పాటికి ఐపోదు" రన్నారు.

తలొకరూ తలొకవిధంగా అన్నారు.

మీదకు ఎక్కిన పులి కొంతదూరంలో కొండ దిగడం చూశారు. ఇదే మంచి సమయం అనుకొంటూ బాబాయి గబగబా పులికి ఎదురుగా కొండ ఎక్కారు. తిరిగి అదేదూరం. తుపాకి పేలింది. ఒక బార్‌నుంచి తూటా వచ్చి కంటికి ప్రక్కగా పులి శరీరంలోకి దూసుకుపోయింది. అంతే! అలాగే పులి కూర్చున్నట్లుగా పడిపోయింది. తుపాకి మళ్లీ పేలింది. రెండవ బార్‌లోంచి ఇంకొక తూటా వచ్చి జెబ్బలో దూరింది.

ప్రజల హాహాకారాలు మిన్నుముట్టాయి. బాబాయి, ఆ 'పెద్ద మనుష్యులు' పులిని సమీపించారు. వారితోపాటు కొండక్రింద ఉన్న ప్రజలు పరువులెత్తుకుంటూ వచ్చి పులిని కొండపైనుండి క్రిందకు దింపారు. "బాబూ, నావృత్తి వేట. ఈ పులిని చంపి ఏదో ఈ ఊరి ప్రజలనుంచి లాభం పొందుదామని వచ్చా"నంటూ

(తరువాయి 64 వ పేజీలో)

## మీకు తెలుసా?

### జవాబులు

1. శరీరం బరువులో కండరాల బరువు నూటికి 42 వంతులు; ఎముకలు 16 వంతులు; చర్మం ఏడు వంతులు; కొవ్వు 19 వంతులు మెదడు రెండు వంతులు; గుండె రెండు వంతులు; కడుపు ఏడు వంతులు; రక్తం అయిదు వంతులు.

2. హవాయి; 1959 వ సంవత్సరంలో యు. ఎస్. ఎ. లో 50 వ రాష్ట్రమైనది.

3. 369 వ సంవత్సరంలో; సిసీరియా అనే ఒక మతాధికారి మధ్యధరా సముద్ర తీర ప్రాంతంలో దానిని నిర్మించారు.

4. టారిసెల్లీ (ఇటలీ); 1643 వ సంవత్సరంలో.

5. న్యూయార్కు రేవు దగ్గరి ద్వీపంలో నిర్మించబడిన లిబర్టీ విగ్రహం. ఇది రాగితో తయారు చేయబడినది. ఎత్తు 151 అడుగులు.

6. లండన్ నగరంలో డౌనింగ్ వీధిలో పదవ నంబరు ఇల్లు.

7. సిసిలీ.

8. యూక్లిడ్ (గ్రీసు); క్రీస్తు పూర్వం 300 సంవత్సరంలో. ★

## ఉత్తరాలు

11-4-62 వ తేది సంచికలో శ్రీ జి. ఆంజనేయులుగారి 'కాముకి' కథపై శ్రీ పి. నరసింహారావుగారి విమర్శ చదివాను. అందులో వారు కొంచెము పొరపడిరని చెప్పుటకు విచారిస్తున్నాను. షాజహాన్ చక్రవర్తికి ఇరువురు కూతుళ్ళు. వారి పేర్లు జహానారా, రోషనారా. వీరిలో జైలులో ఉన్న షాజహాన్‌కు జీవించినంతకాలము అవివాహితయై సేవచేసి, తదనంతరము యోగినియై భక్తి గీతములను రచించి పాడుకొనుచు భగవద్ధ్యానములో తన శేష జీవితమును గడుపుకొనినది పెద్ద కూతురైన జహానారా కాని చిన్న కూతురగు రోషనారా కాదు. తన కండ్లముందు పెద్దవాడగు దారాషుకో, అతని కొడుకు సిపహ్‌షుకో, మిగతా సోదరులగు షుజ్, మురాదుల తండ్రియగు షాజహాన్ యొక్క మరణములను కన్నులారా గాంచి మనసు విరక్తి చెంది సన్యాసినియైనది జహానారా. తన జీవితమును మతధర్మములకే వినియోగించి సాధువుగా మక్కాయందు తన శేష జీవితమును గడుపదలంచుకొనిన ఔరంగజేబునకు సర్వమత సమవర్తియగు దారాషుకో మత దృష్టిని హిందూ మతోన్మాద దృషి గా అతనికి ( ఔరంగజేబుకు ) చూపి అతనిలో మతోద్రేకమును రెచ్చగొట్టి, దానివలన సోదరులను, తండ్రిని చంపుకొని నయా మెరోషన్ ఆరా. తాను రాణియగు ఆశనిరాశకాగా ఔరంగజేబును అడ్డము పెట్టుకొని రాజ్య మేలినది రోషనారా. ఈ విషయమును గుర్తింప ప్రార్థన.

—గోపాలుని రాజగోపాలరావు
(శంకర భారతీపురం)

9—5—62 వ తేదీ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో జి. శ్రీ కృష్ణగారు 'మంచి మనసులు' లో వివాహానంతరము వేణు రాధకు హంపీ మొదలైన పుణ్యస్థలములు చూపించినట్లు వ్రాసినది పొరపాటన్నారు. అలా అనుకోవడమే పొరపాటు. సినిమా చూస్తే బాగా బోధ పడుతుంది. సినిమాలో జడ్జి కూడా అదే ప్రశ్న అడిగితే చూపించడమంటే "పాట రూపములో హృదయమునకు వినిపించుచు నా కళ్ళు ఇచ్చి చూపించితిని" అని వేణు సమాధానము చెపుతాడు. అది కృష్ణగారు గమనించాలి.

—కె. జవహరు
(మద్రాసు—1)

ఈ వారం సంచిక ( 9—4—62 ) ముఖచిత్రం 'తీయని తలపులు' నన్ను తృప్తిపరచింది. కనీసం నెల కొకసారయినా చిత్రాలను ముఖచిత్రంగా ప్రచురించమని ప్రార్థిస్తున్నాను. ఈ పాఠకుని అల్పమైన ఈకోర్కె తీరుస్తారు కదూ!

—ఆర్కే వూడమూడి
(వరిఫేడు )

'ఆత్మహత్య మహా పాతకం' అంటాయి శాస్త్రాలు. వివేకియైనా, విజ్ఞానవంతురాలయినా, సమాజంలో ఉన్న లోటుపాట్లను గుర్తించిన భానుమతి వంటి విజ్ఞానవంతురాలు ఆఖరి క్షణంలో జీవితమునకు విరక్తి చెందడానికి కారణం ఏమిటి? అది పాతకం కాదా మరి? అయినా భానుమతిని ఇంత శీలవంతురాలుగా చిత్రించిన దానికి రచయిత్రికి ధన్యవాదాలు. 'కెరటాలు' సీరియల్ ఎంత చదవాలన్నా చదవాలనిపిస్తున్నది. 'పేకమేడలు' సీరియల్ విషాదాంతము అయినందువల్ల చాలా చింతిస్తున్నాను.

—వై. శేషశాయి
( అనంతపురం ) ★

## పులివేట

( 8 వ పేజి తరువాయి)

ఆ 'నిన్నటి' వేటగాడు బాబాయి దగ్గరకు వచ్చాడు.

తన కోరిక ఇప్పటికి నెరవేరింది కదా అన్న సంతోష సాగరంలో ఈదుతూన్న బాబాయికి వానిమీద కలిగిన కోపం పటాపంచలై 'పాపం!' అని మనస్సులో జాలిపడి, "అయితే ఈ పులిని ఇంటింటికీ త్రిప్పి డబ్బు వసూలు చేసుకో" అన్నారు.

బాబాయి పులిని చంపారన్న వార్త మాకు అరగంటలోనే తెలిసింది.

పెట్రోలు టాంకుకు చిరుతపులిని కట్టి మోటారు సైకిల్‌మీద బయలుదేరి పన్నెండు వ్వరకు బుచ్చిలో ప్రవేశించారు. ఊరిలోకి రాగానే ఆయన్నుఆపి మెడలో పూలమాలలు వేశారు బుచ్చిప్రజలు. బాబాయంటే ఆ ఊరి వారికెంతో ప్రేమాభిమానాలు!

బాబాయి ఇంటి కాంపౌండులోకి ప్రవేశించగానే ఫోటోతీద్దామనుకున్నాము. కాని దురదృష్టం కొలదీ ఫిల్మ్ అయిపోయింది.

పులిని క్రిందకు దించారు. క్రొవ్వుబలిసి దుక్కలా తయారైంది. పొడవు ఐదడుగుల పదకొండు అంగుళా లుంటుంది.

"బాబాయ్! ఈ పులిని ఊరంతా త్రిప్పితే అందరూ చూస్తారుకదా!" అన్నాను.

"అవున్రోయ్! గుడ్ అయిడియా!" అంటూ కొత్తెంమీద జెల్లకొట్టారు నవ్వుతూ.

'బాబాయికి కోపంవచ్చినా, సంతోషం కలిగినా ప్రక్కనుండకూడదు' — లెంకి తడుము కొంటూ అనుకొన్నాను ★

Printed and Published by S. V. Swamy B.A., on behalf of Andhra Prabha Ltd. and Printed at Dinamani Press, Mount Road, Madras and Published at Gandlapalli, Chittoor. Editor: Neelamraju Venkataseshaiah.